15102024-DIS-04_Layout 1 10/15/2024 1:56 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అక్రమ నిర్బంధాలు

సాక్ష్యాధారాలు లేని కేసులో సుదీర్ఘకాలం జైలులో దుర్భర జీవితం గడిపి, విడుదలైన కొన్నాళ్లకే తీవ్ర అనారోగ్యంతో మరణించిన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా ఉదంతం భారత న్యాయ, పరిపాలనా వ్యవస్థలకు సంబంధించిన పలు మౌలిక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. దర్యాప్తు ముసుగులో, విచారణ సాకుతో మనుషులను జైళ్లలో మగ్గబెట్టడమనే దుష్ట సంప్రదాయానికి ఆయన బలైపోయారు. సుమారు పదేండ్ల 'అం డా సెల్' నిర్బంధం ఆయనను శారీరకంగా కుంగదీసిందని విడుదల తర్వాతి పరిణామాలు రుజువు చేశాయి. నక్సల్స్‌తో సంబంధాలున్నాయని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నారనేది ఆయన మీద చేసిన ప్రధాన ఆరోపణ. అందుకు ఆధారాల్లేవని బాంబే హైకోర్టు నాగపూర్ బెంచి నిర్దోషిగా తేల్చడంతో ఆయన స్వేచ్ఛను పొందగలిగారు. యల్గార్ పరిషద్ కేసులో నిర్బంధించిన ఫాదర్ స్టాన్‌కు ఆ మాత్రం అవకాశం కూడా దక్కలేదు. ఆయన నిర్బంధంలోనే కన్నుమూయడం ఏ రకంగా సమర్థనీయం. ఢిల్లీ యూనివర్సిటీలో తన ప్రొఫెసర్ ఉద్యోగాన్ని తిరిగి పొందేందుకు పోరాడుతూనే సాయిబాబా కన్నుమూయడం బాధాకరం. ఆయన అనుభవంతో దేశంలో నిద్రాణమైపోయిన అండర్ ట్రయల్స్ లేదా విచారణ ఖైదీల సమస్య మరోమారు ముందుకు వచ్చింది. 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలోని వివిధ రకాల జైళ్లల్లో మొత్తం 5,73,220 మంది ఖైదీలుంటే వారిలో 4,34,302 మంది విచారణ ఖైదీలే. వారిలో అత్యధికులు అట్టడుగు వర్గాలవారే. ఇటీవలి కాలంలో సాయిబాబా లాంటి రాజకీయ, మేధావి ఖైదీలు వారిలో వచ్చిచేరారు.

సంస్థలు ఏవైనా, ఆరోపణలేవైనా, కేసులేవైనా ఒకటి మాత్రం నిజం. ప్రభుత్వ ఆలోచనతో పొసగని వివిధ భావజాలాలకు చెందినవారిని నిర్బంధించుకుంటూ పోతున్నారు. మహారాష్ట్ర యల్గార్ పరిషద్ కేసు అయినా, ఢిల్లీ లిక్కర్ కేసు అయినా, మరో కేసు అయినా నెలల తరబడి, ఏండ్ల తరబడి జైలుకే పరిమితమైపోయిన వారెందరో. న్యాయం నిర్ణయించేది ఎవరు? ప్రభుత్వమా, న్యాయస్థానాలా? అక్రమ నిర్బంధాలతో తీర్పులు లేని శిక్షలు అమలు చేస్తున్నది కేంద్రం. ప్రభుత్వాలే న్యాయ పరిధిని అతిక్రమిస్తూ పోతుంటే ఇంక కోర్టులు దేనికి? బెయిల్‌కు వీలులేని చట్టాలను చేసి కోర్టుల చేతులు కట్టేయడం మనం చూస్తున్నాం. చివరకు ఉన్నత, సర్వోన్నత న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటే గాని బెయిల్ దక్కని పరిస్థితి. ఎట్టకేలకు బెయిల్ దక్కి విడుదలైనందుకు సంతోషించాలా, జైలు జీవితం శారీరకంగా, మానసికంగా చేసిన నష్టానికి బాధపడాలా? అనేది ప్రశ్న. జైలులో గడిపిన కాలానికి నష్టపోయిన వ్యక్తిగత కుటుంబ జీవనం, వృత్తి జీవితం, అన్నిటికీ మించి ఆరోగ్యం ఎవరు తిరిగిస్తారు? ఎవరు దీనికి బాధ్యత వహిస్తారు? వేదన జైలులో గడిపిన వ్యక్తిది మాత్రమేనా? అతని కుటుంబ సభ్యులు, సహచర మిత్రులు అనుభవించిన ఆవేదనకు ఎవరు పరిహారం చెల్లిస్తారు?

విభిన్న రాజకీయ, సామాజిక భావజాలాలను, వాదాలను సర్దుబాటు చేసుకోవడమే కదా ప్రజాస్వామ్యం. ఆ స్ఫూర్తికి భంగం కలిగించి నష్టపరచడం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది. కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలోని దర్యాప్తు సంస్థలు ఈ సంప్రదాయాన్ని ఇష్టారాజ్యంగా కొనసాగిస్తూ విమర్శల పాలవుతున్నాయి. కోర్టులు పలు సందర్భాల్లో అక్షింతలు వేస్తున్నా పరిస్థితిలో పెద్దగా మార్పు రావడం లేదు. బెయిల్ అనేది సార్వత్రికం, జైలు అనేది మిహాయింపు మాత్రమేనన్న సూత్రాన్ని సుప్రీం కోర్టు ఇటీవలి కాలంలో పలు సందర్భాల్లో నొక్కిచెప్పడం గమనార్హం. ప్రొఫెసర్ సాయిబాబాకు ఈ సూత్రాన్ని వర్తింపజేసి విడుదల చేసేసరికి చాలా ఆలస్యమైంది. ఆలస్యంగా న్యాయం చేయడం అన్యాయం చేయడమేననే నానుడిని మన న్యాయవ్యవస్థ తు.చ. తప్పకుండా పాటిస్తేనే అనవసర నిర్బంధాలకు తెరపడుతుంది.

ఇప్పటికీ కలగని వివేకం

టంకశాల అశోక్

ప్రజల తీవ్ర నిరసనలు, హైకోర్టు వరుస చెంపదెబ్బలు, పలువైపుల నుంచి ఘాటైన విమర్శలతో ప్రభుత్వానికి హైడ్రా విషయమై మూడు నెలలు ఆలస్యంగా 'కొంత' జ్ఞానోదయం కలిగినట్లున్నది. ఆ మాత్రం జ్ఞానోదయమేమిటో ముందు చూసి, అది కూడా కొంతమేరకే అనటానికి కారణాలేమిటో తర్వాత చెప్పుకుందాం. హైడ్రా పథకం అమలు, అందువల్ల ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర ప్రభుత్వ బాధ్యులతో పాటు, సంబంధిత అధికారులైన వారు ఇటీవల చేస్తున్న కొత్త తరహా ప్రకటనలను, అరకొరగానైనా తీసుకుంటున్న చర్యలను గమనించండి. అవి వారికి, మొదట పేర్కొన్న మూడు విధాలైన పరిస్థితుల ఒత్తిడితో, కొత్తగా కొంత జ్ఞానోదయం కలిగినట్టు చెప్తున్నాయి. అదే సమయంలో అవి ఒకమేరకే అయినందున, అర్ధ జ్ఞానోదయంగా మిగులుతున్నది. అట్లా అర్ధ జ్ఞానోదయం కావటానికి కారణం నిజాయితీ లేనితనమేమో విచారించవలసి ఉన్నది. ఆ పని చివరికి చేద్దాం.

జల వనరులను, పర్యావరణాన్ని పరిరక్షించటం కోసమంటూ ఎంతో ఆదర్శవంతమైన, ప్రశంసనీయమైన మాటలతో హైడ్రాను సృష్టించిన ముఖ్యమంత్రి ఆలస్యంగా జరిగిన అర్ధ జ్ఞానోదయం తర్వాత ఇప్పుడేమంటున్నారో చూడండి:- ఏ ఒక్కరినీ బాధపెట్టం. నిర్వాసితుల కోసం మేమున్నాం. రూ.10 వేల కోట్లయినా ఖర్చుచేస్తాం. రివర్ బెడ్, బఫర్‌జోన్‌లో ఉన్నవారికి ప్రత్యామ్నాయంగా ఇండ్లు, పునరావాసానికి పూచీ మాది. మూసీ నిర్వాసితులందరికీ తప్పకుండా ప్రత్యామ్నాయం చూపుతాం. ఎలా ఆదుకుందామో ప్రతిపక్షాలు చెప్పాలి. అన్ని పక్షాలతో కమిటీ వేద్దామా? వారి సూచనలతో అసెంబ్లీలో తీర్మానం చేద్దాం. అన్నీ కోల్పోయే పేదల బాధలు తెలియకుండానే ఇంత దూరం వచ్చానా? నేను ఎవరినీ అనాథను చేయను. ఇవన్నీ ముఖ్యమంత్రి ఈ నెల మొదటి వారంలో వేర్వేరు సందర్భాలలో అన్న మాటలు.

అయితే ఈ మాటలన్నీ ఎప్పుడు వచ్చాయి? అంతకు కొద్దిరోజుల ముందు సెప్టెంబర్ 30న హైకోర్టు, ఒక అధికారినైతే, తాము చెప్పినా వినరా? జైలుకు పంపాలా? అని తీవ్రంగా హెచ్చరించిన తర్వాత. దసరా పండగ తర్వాత 16వ తేదీన ప్రభుత్వం తిరిగి హాజరు కావలసి ఉన్నది. ఆ విధంగా సెప్టెంబర్ 30, అక్టోబర్ 16ల మధ్య అడకత్తెరలో పోక చెక్క వలె చిక్కుకున్న సర్కారు వారి ఆపద్ధర్మ జ్ఞానోదయమిది అని ఎందుకు భావించకూడదు? సరిగా ఇదే స్ఫూర్తి సంబంధిత అధికారులను కూడా ఆవహించినట్టున్నది. హైడ్రా కమిషనర్ రంగనాథ్, మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఎం.డి.దానకిశోర్‌ల మాటలు అటూ ఇటుగా ఈ విధంగా ఉన్నాయి: - హైడ్రా అంటే బూచి కాదు, భరోసా. పర్మిషన్ ఉన్న ఏ నిర్మాణాన్ని కూల్చివేయం. ఇండ్లలో కుటుంబాలు నివసిస్తున్నా ముట్టుకోం. పేదలకు, మధ్య తరగతికి అన్యాయం చేసే ఉద్దేశం లేదు. చిన్నవాళ్లు, పేదల జోలికి వెళ్లడం లేదు. ఏ ఒక్కరినీ బలవంతంగా తరలించం. మూసీ నిర్వాసితులకు శాశ్వత పునరావాసం, జీవనోపాధి కల్పిస్తాం. ప్రక్షాళన సుందరీకరణ కోసం కాదు, నదిని శుభ్రం చేసేందుకు. విద్యార్థులకు గురుకులాల్లో ప్రవేశం కల్పిస్తాం. 23 ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేశాం. ఫిర్యాదులకు ప్రత్యేక యాప్, వగైరాలు.

అర్థం కాని విషయం ఏమంటే, ఇటువంటి గొప్ప మాటలు, భరోసానిచ్చే మాటలను ప్రజలకు మూడు నెలల క్రితం హైడ్రాను ప్రకటించినప్పుడే ఎందుకు చెప్పలేదు? వారి ప్రాంతాలకు పోయి గుట్టుచప్పుడు కాని సర్వేలు చేసి, ఇండ్లకు ఎర్రగుర్తులు వేసి, ఇండ్లపైకి రేకుల షెడ్లపైకి నోటీసులు ఇచ్చి, ఇవ్వకుండా, పోలీసులతో భయపెడుతూ షెడ్ల కూల్చివేతతో, ఉపాధి పోగొడుతూ గిన్నెలలో అన్నాలు ఉడుకుతుండగా, పిల్లల పుస్తకాలు లోపలే ఉండగా, కోర్టులు ఉండని రోజులను చూసి, కోర్టులుంటే స్టేలు తెచ్చుకుంటారనే దారుణమైన మాటలతో జేసీబీ పటాలాలను పంపి నిరాశ్రయులను చేసినప్పుడు ఈ వివేకం ఏమైంది? హైకోర్టు కొరడా దెబ్బల భయం లేనట్లయితే ఈ వివేకోదయాన్ని నటించనైనా నటించి ఉండేవారా? హైడ్రాకు చట్టబద్ధత లేని రోజుల లోనూ ఉందని బుకాయించి, అదే ప్రశ్న న్యాయస్థానం వేసినపుడు తలలువాల్చుకునేవారా?

అదేవిధంగా మరెన్నో సూటి ప్రశ్నలకు? ప్రభుత్వమూ, ఈ అధికారులూ ఇప్పుడు చేస్తున్నవి, అంటున్నవి కొన్నింటిని గమనించండి. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులన్నింటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల గుర్తింపుతో సమగ్ర సర్వే జరపాలని ప్రభుత్వం ఈ నెల మొదటివారం చివరన 7వ తేదీ నాడు ఉత్తర్వు చేసింది. ఆ పని చేయగానే వెబ్‌సైట్‌లో వివరాలు పెట్టాలంది. ఇటువంటి మౌలికమైన, ప్రాథమికమైన పని చేయవలసింది ఎప్పుడు? కూల్చివేతలకు ముందా, పని మొదలుపెట్టిన మూడు మాసాల తర్వాతనా? అసలు ఇటువంటి సర్వే జరిగిందా, ఆ మ్యాపులు ఎక్కడ, వాటిపై తుది నోటిఫికేషన్లు ఇచ్చారా అని హైకోర్టు ఇప్పటికే నిలదీసింది. ఆ మాటను మళ్లీ విచారణలో ముందుకు తెచ్చే అవకాశం లేకపోతే, ఇప్పటికైనా ఇటువంటి ఉత్తర్వులు ఇచ్చేవారా? పోతే, ఈ సర్వేను 45 సంవత్సరాల డేటా, మ్యాపుల ఆధారంగా చేస్తామంటున్నారు. ఇది 2024వ సంవత్సరం. 45 సంవత్సరాలంటే 1979 అవుతుంది. దానిని బట్టి 1979ని కటాఫ్ సంవత్సరంగా భావిస్తున్నారా? లేక ఇందులోనూ లొక్యం చూపుతున్నారా? ఈ మాటను వారు నిర్దిష్టంగా ప్రకటించలేదు.

> వాస్తవానికి ఈ హైడ్రా వ్యవహారం మొదలైనప్పటి నుంచి ఇంతవరకు కటాఫ్ తేదీపై స్పష్టత అన్నదే లేదు. ఇంత ముఖ్యమైన విషయంలో కటాఫ్ తేదీ ఎంత కీలకమో చెప్పనక్కరలేదు. కానీ ప్రభుత్వం ఆ సంగతే గుర్తించకుండా అవకతవకల పరిపాలన సాగిస్తున్నది.

ఆ కటాఫ్ సంవత్సరం 1979 అవుతుందా అన్నది ఇప్పుడైనా స్పష్టంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇస్తే, ప్రజలకు ఒక పెద్ద అయోమయం తీరుతుంది. ఆ పనిచేస్తారా? వాస్తవానికి ప్రభుత్వానికి పూర్తిగా వివేకం కలిగి ఉంటే, హైకోర్టు గత విచారణ జరిగిన సెప్టెంబర్ 30 నుంచి, మరుసటి విచారణ జరగనున్న అక్టోబర్ 16 మధ్య గల రెండు వారాల వ్యవధిని ఉపయోగించుకొని మరికొన్ని పనులు చేయవలసింది. కూల్చివేతలకు ముందు నోటీసులు ఇవ్వకపోవటం, హఠాత్తుగా కూల్చివేతలు, జోన్ల గుర్తింపు మొదలైనవాటి గురించి న్యాయమూర్తి మొదటిసారి విచారణ సమయంలోనే ప్రశ్నించారు. అయినప్పటికీ ప్రభుత్వం, అధికారులూ రెండు సార్లు కూడా ఖాతరు చేయనందువల్లనే ఆగ్రహించి మూడవ విచారణకు రంగనాథ్‌ను, ఒక తహిశీల్దార్‌ను కోర్టు సమక్షానికి సమన్ చేశారు. కనుకనే వారు ఈ మాత్రమైనా కదిలారు గానీ, ఇప్పటికైనా ఈ రెండు వారాల సమయాన్ని ఉపయోగించుకొని, చేయవలసిన మరికొన్ని చేయటమే లేదు. ఉదాహరణకు, ఆయా స్థలాలను రిజిస్టర్ చేసింది అధికారులే, నిర్మాణాలకు అనుమతులిచ్చిందీ వారే. కొన్ని సందర్భాలలో ఇది దశాబ్దాల కిందటే జరిగింది. ఇవన్నీ ప్రభుత్వ శాఖలు చేసినప్పుడు ఇప్పుడు మరొక ప్రభుత్వ శాఖ వచ్చి ఇదంతా చట్టవిరుద్ధమంటే అర్థం ఏమిటని, సదరు అధికారులపై చర్యలేమిటని కోర్టు ఇప్పటికే ప్రశ్నించింది. అందుకు ప్రభుత్వం ఒక ఆరుగురికి నోటీసులివ్వటం మినహా తక్కిన అధికారులను, ఇంతవరకు కనీసం గుర్తించలేదు. చర్యల మాట, ఇందుకు బలవుతున్న పౌరులకు పరిహారాల సంగతి తర్వాతి విషయం. ఒకవేళ ఈ అంశాలు రానున్న వాయిదాలలో కోర్టు ప్రస్తావిస్తే ఏమి సమాధానం చెప్తారు?

ఇటువంటివే మరికొన్ని ప్రశ్నలున్నాయి. ఒక వేళ హెచ్ఎండీఏ పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను 45 ఏండ్ల డేటాతో గుర్తించబూనితే, ఆ కాల పరిధిలోనూ వేర్వేరు ప్రభుత్వ ఏజెన్సీల డేటా వేర్వేరుగా ఉండి, మ్యాపులు, సర్వే నంబర్లు తేడాగా ఉండి, వేర్వేరుగా ఉండి, వాటి మధ్య వైరుధ్యాలున్న కేసులు కనిపిస్తున్నాయి. అందుకు ఒక ప్రముఖమైన ఉదాహరణ దుర్గం చెరువు వద్ద గల అమర్‌కాలనీ. అటువంటప్పుడు వాటిని ఏ ఆధారాలతో, ఏ తర్కంతో, ఏ విధంగా రికన్సయిల్ చేసి దేనిని ప్రామాణికంగా నిర్ధారిస్తారు? దేనిని చేయబూనినా కొన్ని నిర్మాణాలకు సంబంధించి పేచీ వస్తుంది. అట్లాగే, 45 సంవత్సరాలకు ముందు- తర్వాత అన్న విభజన కూడా ఈ హైదరాబాద్ మహానగర ఆధునిక విస్తరణ 1979కి ముందే మొదలై అందులో భాగంగా చట్టబద్ధమైన, చట్ట విరుద్ధమైన నిర్మాణాలు కూడా సాగుతూ వచ్చినప్పుడు ఈ 1979 గడువు కూడా చిక్కులకు దారితీయగలదు. అసలు 45 సంవత్సరాలనే నిర్ధారణలోని తర్కమేమిటి? కనుక అవి కోర్టు చిక్కులుగానూ మారుతాయి. అందుకు ప్రభుత్వం వద్ద సమాధానాలున్నాయా?

ఈ కార్యక్రమం వల్ల నగరంలోని చెరువులు, నాలాలు, మూసీ ప్రాంతంలో నిర్వాసితులు కాగలది ఎందరు? వారికి పరిహారాలేమిటి, ప్రత్యామ్నాయ నివాసాలు, ఉపాధులు, చదువులు, వైద్యాలు, రవాణా సదుపాయాల వంటి వాటిపై అన్నీ చేస్తామనే మాటలు (ఈ నెలలోనే ఉపాధి కమిటీ ఒకటి వేశారు) తప్ప, ఇంత పెద్ద కార్యక్రమంపై హైడ్రాను ప్రకటించి మూడు నెలలు గడిచినా ఒక సమగ్ర ప్రణాళిక లేదు. ఇప్పటికైనా ప్రకటించలేదు నోటి మాటలు తప్ప. నిధుల కేటాయింపులు లేవు.

ఇందుకు సంబంధించి మరొక ముఖ్యమైన ప్రశ్న ఉంది. మూసీని శుద్ధి చేయటం, అందుకోసం నదిలోని మురుగును, చెత్తను తొలగించటం, వ్యర్థాలు కొత్తగా చేరకుండా చూడటం, పారిశ్రామిక రసాయన వ్యర్థాలను రానివ్వకపోవటం, తమ కార్యక్రమమని అధికారులు తమకు ఆలస్యంగా తట్టిందనే అభిప్రాయం కలిగేట్లు ప్రజలకు ఇప్పుడు చెప్తున్నారు. ఇకముందు చేయదలచింది ఏమిటో చెప్పాలి. ప్రస్తుత కూల్చివేతల సందర్భంలో అంతకన్న ముఖ్యంగా, ఈ శుద్ధి సంబంధిత కార్యక్రమాలన్నీ మొదట అమలు జరిపి ఫలితాలను చూడకుండా, మొదట కూల్చివేతలు, ఆ తర్వాత శుద్ధి అనే తలకిందుల విధానంలోని తర్కం ఏమిటో వివరించాలి. ఎన్నో చోట్ల జరిగినట్లు, కొందరు నిపుణులు ఇప్పటికే ఎత్తిచూపినట్లు, మూసీకి రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మించటం, అదే సమయంలో శుద్ధి కూడా జరపటం, ట్రీట్‌మెంట్ ప్లాంట్ల సంఖ్యను తగినంత పెంచటం ద్వారా సమస్య పరిష్కారం అవుతుందా లేదా అనే అధ్యయనాన్ని ప్రభుత్వం ఎందువల్ల చేయించి చూడటం లేదో ప్రజలకు తెలియాలి.

పోతే, నిధుల కొరత పేరిట అభివృద్ధి, సంక్షేమాలను పక్కన ఉంచి, రాష్ట్రంపై భారీగా అప్పుల భారం ఉందని కూడా అంటూ, (రుణమాఫీ పూర్తిగా చేయలేకపోవటానికి కారణం ఆర్థిక సమస్యలని, అప్పు పుట్టటం లేదని, కనుక గత డిసెంబర్ 9న చేస్తామన్న మాఫీని వచ్చే డిసెంబర్ 9 నాటికి గాని చేయలేమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ఈ నెల 13న సెలవిచ్చారు. ఆగస్టు 15 గడువును నిలబెట్టుకోలేకపోయినట్లు కూడా మరోసారి ఆ విధంగా అంగీకరించారు. అటువంటప్పుడు హడావుడిగా ఈ లక్షన్నర కోట్ల ప్రాజెక్టును తలకెత్తుకోవలసిన అత్యవసరం ఏమి వచ్చిందనే ప్రశ్నలు, మెయిన్ హార్ట్ అనే కన్సల్టెన్సీ కమ్ అమలు కంపెనీ రూపంలో భారీ కుంభకోణం ఉందా అనే ఊహాగానాలు వినవస్తున్నాయి గాని, ప్రస్తుతం ఆ చర్చలోకి వెళ్లటం లేదు. ప్రధానమైన ప్రశ్నలకు సంబంధించిన జవాబులే ప్రభుత్వం నుంచి ఇంకా రావలసి ఉన్నందున, ప్రజలకు, హైకోర్టుకు రాగల రోజులలో ఏమి వివరించగలరో చూడవలసి ఉంది.

> స్థలాలను రిజిష్టర్ చేసింది అధికారులే, నిర్మాణాలకు అనుమతులిచ్చిందీ వారే. కొన్ని సందర్భాలలో ఇది దశాబ్దాల కిందటే జరిగింది. ఇవన్నీ ప్రభుత్వ శాఖలు చేసినప్పుడు ఇప్పుడు మరొక ప్రభుత్వ శాఖ వచ్చి ఇదంతా చట్టవిరుద్ధమంటే అర్థం ఏమిటని, సదరు అధికారులపై చర్యలేమిటని కోర్టు ఇప్పటికే ప్రశ్నించింది.

కేసీఆరే యాదికొస్తుండు

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

> నాడు కేసీఆర్ పాలనలో చిన్నచిన్న సమస్యలు వస్తే 'దొరల పాలన, గడీల రాజ్యం' అంటూ యూట్యూబ్ చానళ్లు హోరెత్తించాయి. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా కేసీఆర్ తీర్చిదిద్దినా.. 'ఆయన ఇంట్లకెళ్లి తెస్తుండా?' అని కుహనా మేధావులు అన్నారు. 'మేమొస్తే అంతకన్నా ఎక్కువ చేస్త'మని కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. వారి మాటలను నమ్మిన ప్రజలు 'రెండుసార్లు కేసీఆర్‌ను గెలిపించాం, ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశమిద్దాం' అని హస్తం పార్టీని గద్దెనెక్కించారు. అయితే, ప్రజలు ఆశించిందొకటి, ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నదొకటి. 10 మాసాల రేవంత్ సర్కార్ ప్రజా వ్యతిరేక పాలనలో ప్రజలు అరిగోస పడుతున్నారు.

తెలంగాణ వస్తే మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే దక్కుతాయని, తద్వారా మన బతుకులు బాగుపడతాయని ఉద్యమ సమయంలో కేసీఆర్ పదే పదే చెప్పేవారు. తెలంగాణ గోస తెలిసిన వ్యక్తి కావడంతో స్వరాష్ట్రం సిద్ధించాక ఆయనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అధికారంలోకి రాగానే తాగు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు పూనుకున్నారు. చెరువులు, కుంటలను పునరుద్ధరించారు. 24 గంటల కరెంటు ఇచ్చారు. రైతు బంధు, రైతు బీమా, రూ.2000 పింఛన్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలను తీసుకొచ్చారు. కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల దరికే చేర్చారు. జిల్లాకో మెడికల్ కళాశాల, బస్తీ దవాఖానల ఏర్పాటు, కేసీఆర్ కిట్ అందజేసి ఆరోగ్య తెలంగాణను సాక్షాత్కరించారు. పదేండ్లలో సుమారు 1.60 లక్షల వరకు ఉద్యోగాలు కల్పించారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిజంగానే ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక, డైవర్షన్ రాజకీయాల కోసం పేదల ఇళ్లను కూలుస్తూ, వారి బతుకులను బజారుకీడ్చి కాంగ్రెస్ మార్క్ మార్పును రుచి చూపిస్తున్నది. ఎన్నికల్లో హస్తం పార్టీ ఇచ్చిన వందల హామీలన్నీ అటకెక్కాయి. కేసీఆర్ సర్కార్ అమలుచేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసిన రేవంత్.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సైతం తుంగలో తొక్కారు. రుణమాఫీ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. రుణాలు మాఫీ అవ్వని రైతులు రోడ్డెక్కుతున్నారు. కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు ఇస్తానన్న తులం బంగారం, రైతు భరోసా పెంపు, ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ.. ఇలా ఉద్యోగ, నిరుద్యోగ, రైతు, కార్మిక, మహిళా లోకాలకు లెక్కలేనన్ని హామీలిచ్చి ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయలేక కొత్త హైడ్రామాకు తెరదీశారు. ఈ నేపథ్యంలో ఇదేనా ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ ప్రజలు కాంగ్రెస్ పాలకులను ప్రశ్నిస్తున్నారు.

> ఇచ్చిన హామీలను అమలుచేయలేక, ప్రభుత్వ వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రామా చేస్తున్నారు. రేవంత్ తెరలేపిన హైడ్రామాకు అమాయకులు బలవుతున్నారు. ఏకపక్షంగా రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన హైడ్రా.. పేద, మధ్యతరగతి ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. ఏ క్షణం బుల్డోజర్లు వచ్చేస్తాయో, తమ ఇళ్లను ఎక్కడ కూల్చివేస్తారోనని పేద ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

హైదరాబాద్ పరిధిలో వేలాది చెరువులు, కుంటలు ఉండేవన్నది అక్షర సత్యం. అవి అన్యాక్రాంతం అయ్యాయన్నది వాస్తవమే. కానీ, అది ఒక్క రోజులో జరగలేదు. ఉమ్మడి ఏపీని ఎక్కువ ఏండ్లు పాలించిన కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే కబ్జాకోరులు చాలా చెరువులను చెరబట్టారన్నది జగమెరిగిన సత్యం. పాలకుల వద్ద పలుకుబడి ఉన్న సంపన్నులు, బడా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు చెరువు, కుంటలను ఆక్రమించేసి, అక్రమ నిర్మాణాలు చేపట్టి పేదలు, మధ్యతరగతి ప్రజలకు అంటగట్టేశారు. అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న, కొనుగోలు చేసిన అమాయక ప్రజలపై ఇప్పుడు చెరువుల పరిరక్షణ, మూసీ ప్రక్షాళన అంటూ ప్రతాపం చూపిస్తే ఏం లాభం? ప్రత్యామ్నాయం చూపకుండా బాధితులను రోడ్డున పడేయటం ఎంతవరకు సమంజసం. చెరువుల పరిరక్షణ చేయాలంటే మొదటగా పూర్తిస్థాయిలో సర్వే చేయాలి. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను శాస్త్రీయంగా నిర్ధారించాలి. ఆ తర్వాత నోటీసులిచ్చి చర్యలకు ఉపక్రమించాలి. అంతేగాని ఇలా రాత్రికి రాత్రి ఇళ్లను కూలగొట్టడం సబబు కాదు. అధికారుల ఉదాసీనత కారణంగానే చెరువులు అన్యాక్రాంతం అయ్యాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నీటిపారుదల, మున్సిపల్, రెవెన్యూ శాఖాధికారుల నిర్లక్ష్య ఫలితమే ఇది. చెరువుల పరిధిలో వెంచర్లకు అనుమతులిచ్చిన అధికారులపై మొదట చర్యలు తీసుకోవాలి. వారిని బోనులో నిలబెట్టాలి.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలకు ఇప్పటి చేతలకు పొంతనే లేదు. బీఆర్ఎస్ హయాంలో ఒక కాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసినప్పుడు ఆయన అప్పట్లో నానా యాగీ చేశారు. నిర్మాణాలను కూల్చడం సరికాదని, వాటిని రెగ్యులరైజ్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన లేదా? అని ఆయన ప్రశ్నించారు. నాడు పేదల ఇళ్లను కూల్చడం సరికాదని చెప్పిన రేవంత్ ఇప్పుడు హైడ్రా కూల్చివేతలను ఎలా సమర్థించుకుంటారో చెప్పాలి.

తమ రెక్కల కష్టం హైడ్రా కబంధ హస్తాల కింద నలిగిపోతుండటంతో ఇప్పుడు బాధితులు కేసీఆర్‌ను తలుచుకుంటున్నారు. గూడు కోల్పోయి రోడ్డున పడుతున్నవారంతా ఆయనను గుర్తుచేసుకుంటున్నారు. సంక్షేమ సర్కార్‌ను దూరం చేసుకొని తప్పు చేశామని మదనపడుతున్నారు. కాంగ్రెస్ పాలకులు అరిగోస పెడుతుండటంతో 'ఏ పల్లె పిల్లడో.. ఏ తల్లి బిడ్డడో అయ్య కడుపు సల్లగుండా రాజ్యం తెచ్చాడో..' పాటను ప్రజలు యాదిచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా హైడ్రామాకు తెరదించాలి. లేకపోతే పేద ప్రజల కన్నీటి శోకంలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం.

పచ్చని అడవిలో చిచ్చు

> వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని 'దామగుండం' అటవీ ప్రాంతంలో భారత నావికాదళం (ఇండియన్ నేవీ) నిర్మించతలపెట్టిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ (రూ.2,500 కోట్లు) శంకుస్థాపనకు ముహూర్తం ఖరారైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, కేంద్ర రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా హాజరవుతున్నారని సమాచారం. అయితే, 2,900 ఎకరాల అటవీ భూమిని నేవీకి అధికారికంగా అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లను సిద్ధం చేసింది.

డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్
98493 28496

వీఎల్ఎఫ్ రాడార్ నిర్మాణం ఇక్కడే ఎందుకనేది అంతుచిక్కని ప్రశ్న. ఈ రాడార్ స్టేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం 2023 వరకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. కానీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఇక్కడ అటవీ ప్రాంతానికి, స్థానిక ప్రజలకు, పర్యావరణానికి నష్టం కలుగుతుందన్న కారణంతో అంగీకరించలేదు. కేంద్రం నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తలొగ్గలేదు